- చంద్రబాబు హయాంలోనే నిధులు.... పనులు
- గత ప్రభుత్వంలో పూర్తిగా స్తంభించిన పనులు
- రూ. 2500 కోట్లతో పూర్తి కావాల్సిన కాంట్రాక్టు రద్దు
- రూ. 5 వేల కోట్ల అంచనాతో ప్రత్యామ్నాయ ప్రణాళిక
- పరిశీలనలోనే ముగిసిపోయిన పుణ్యకాలం

గాలేరు-నగరిపై మళ్లీ ఆశలు



బాలాజీ రిజర్వాయర్ వద్ద పనులాగిపోవడంతో తుప్పుపట్టిన కాంట్రాక్టు సంస్థ వాహనం

తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అనకాపల్లి జిల్లా దార్లపూడిలో పర్యటించిన సందర్భంగా ఆ ప్రాంత ప్రజలకు మాట ఇచ్చారు.అన్ని రంగాల్లో వెనుకబాటుతనానికి గురైన ఉత్తరాంధ్ర ప్రజలకు న్యాయం చేయాల్సిందే. అయితే సొంత జిల్లాలో ఐదేళ్ళుగా అతీగతీ లేకుండా పోయిన గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు విషయంలోనూ



చంద్రబాబు హయాంలో జరిగిన బాలాజీ రిజర్వాయర్ కట్ట పనులు

జిల్లా ప్రజలు ఆయన నుంచీ ఇదే ప్రాధాన్యతను కోరుకుంటున్నారు. 1985 నుంచీ జిల్లా వాసులను ఊరిస్తున్న గాలేరు-నగరి ప్రాజెక్టును దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఏ ముహూర్తాన ప్రకటించారో గానీ అప్పటి నుంచీ ఏదో ఒక అడ్డంకి ఎదురవుతూనే వుంది. రామారావు తర్వాత ఎందరో ముఖ్యమంత్రులు మారినా పనులు మొదలైంది మాత్రం చంద్రబాబు హయాంలోనే. గత ఐదేళ్ళు వైసీపీ ప్రభుత్వంలో పనులు స్తంభించడమే కాక మునుపటి కాంట్రాక్టును రద్దు పరిచి డిజైన్ సైతం మార్చేశారు. ఇపుడు మళ్ళీ చంద్రబాబు సీఎం కావడంతో సొంత జిల్లా ప్రజల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి.

ప్రాజెక్టు నేపథ్యం

దివంగత సీఎం ఎన్టీ రామారావు రాయలసీమలో కరువు శాశ్వత నివారణ కోసం గాలేరు - నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు రెండవ దశలో 8 నుంచీ 14 వరకూ మొత్తం ఏడు ప్యాకేజీల కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాకు నీరందించాల్సి వుంది. తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, నింద్ర, విజయపురం, పుత్తూరు, నగరి, నారాయణవనం తదితర 14 మండలాల్లో 1.035 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి వుంది. దీనికోసం ఉమ్మడి కడప జిల్లా నుంచీ శేషాచల పర్వతాలలో రెండు చోట్ల టన్నెళ్ళు తవ్వాలి. మొదటి టన్నెల్ ద్వారా నీరు రేణిగుంట మండలం బాలాజీ రిజర్వాయర్‌కు చేర్చాలి. అక్కడ నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్‌కు, ఆపై పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్, వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లను నింపాలి. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచి మిగిలిన రిజర్వాయర్లను కొత్తగా నిర్మించాలి. రెండు టన్నెళ్ళతో కూడిన 94 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఏడు రిజర్వాయర్ల నిర్మాణానికి 2005లో రూ. 2189 కోట్ల అంచనాతో అప్పటి ప్రభుత్వం పనులు మంజూరు చేసింది. 2008లో మళ్ళీ అంచనాలను రూ. 2526 కోట్లకు సవరించింది. పనులకు అనుమతి ఇచ్చిన నాటి వైఎస్ ప్రభుత్వం పనులు మాత్రం మొదలు పెట్టలేదు. దీంతో 2014 వరకూ ఆరేళ్ళ పాటు ప్రాజెక్టు మరుగునపడింది.

ప్రాజెక్టుకు ప్రాణం పోసిన చంద్రబాబు

2014లో చంద్రబాబు సీఎం కాగానే సొంత జిల్లాలో మరుగున పడిన గాలేరు-నగరి ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోశారు. రూ. 2526 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. ఆయన చొరవతో జిల్లా యంత్రాంగం పరుగులు



పెట్టింది. భూసేకరణ పనులు జోరందుకున్నాయి. పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్లకు సంబంధించి ప్రైవేటు భూముల సేకరణ ముగిసింది. బాలాజీ రిజర్వాయర్ కట్ట నిర్మాణం, అక్కడ నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్ వరకూ కాలువ తవ్వకం పనులు, మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు మొదలయ్యాయి. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 0.18 టీఎంసీలుగా వుండగా దాన్ని 2.65 టీఎంసీలకు పెంచేందుకు రూ. 56.08 కోట్లతో పనులు మొదలు కాగా రూ. 25 కోట్ల పనులు చేశారు. వేణుగోపాల సాగర్ అంచనా వ్యయం రూ. 160 కోట్లు. ఇందులో రూ. 35 కోట్ల పనులు పూర్తయ్యాయి. కాలువతో సహా వేపగుంట సాగర్, అడవికొత్తూరు రిజర్వాయర్ల అంచనా వ్యయం రూ. 129.8 కోట్లు. ఇందులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు రాక టన్నెళ్ళ నిర్మాణం పెండింగ్ పడింది. మిగిలిన రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణలో అటవీ శాఖ నుంచీ అనుమతులు రాలేదు. 2019లో ఎన్నికలు వచ్చేటప్పటికీ గాలేరు-నగరి ప్రాజెక్టు పనుల పురోగతి చాలా ఆశాజనకంగా వుండింది.

బాబు హామీ నిలబెట్టుకోవాలి

ఇటీవలి ఎన్నికల్లో చంద్రబాబు తిరిగి సీఎం కావడంతో గాలేరు-నగరి ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బాలాజీ రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే ఈ పనులను పూర్తి చేస్తానని, జిల్లాలో కరువును శాశ్వతంగా నిర్మూలిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఆయనే ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించిన నేపథ్యంలో ఇపుడు తొలి ప్రాధాన్యత కింద ఈ ప్రాజెక్టును ఎంపిక చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రాజెక్టు పనులను సమీక్షించి, అవసరమైన అంచనాలు రూపొందించాలని, ఆ మేరకు నిధులు మంజూరు చేసి వేగంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరుతున్నారు.

జగన్ రాకతో టెండర్లు రద్దు... డిజైన్ మార్పు

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి జగన్ సీఎం కావడంతో ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. పనులన్నీ ఆగిపోయాయి. నిధులూ విడుదల కాలేదు. 2020 జూలై 8న ప్రభుత్వం టెండర్లు రద్దు చేసింది. పాత డిజైన్ ప్రకారం పనులు చేపడితే రామచంద్రాపురం మండలంలో ప్రతిపాదిత పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్ల పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుందని, భూముల విలువ విపరీతంగా పెరిగిపోయినందున భూసేకరణ ప్రభుత్వానికి భారమవుతుందన్న వాదన తెరపైకి తెచ్చింది వైసీపీ ప్రభుత్వం. ఆ వంకతో ఆ రెండు రిజర్వాయర్లనూ రద్దు చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచీ కాలువ తవ్వి నీటిని గాలేరు-నగరి కాలువకు మళ్ళించేలా ప్రత్యామ్నాయ డిజైన్‌ను రూ. 5013 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో రూపొందించారు. అయితే అప్పటి నుంచీ ఆ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదానికి నోచుకోలేదు. దీంతో ఐదేళ్ళ పాటు ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. మరోవైపు పాత టెండర్లు రద్దయ్యాయి. రీ టెండర్లు పిలవలేదు. డిజైన్ కూడా మార్చివేసినా దానికీ అనుమతులు లేవు. నిధులూ ఇవ్వలేదు. అటవీ శాఖ అనుమతులు కూడా సాధించలేదు. ఫలితంగా గత వైసీపీ ప్రభుత్వం గాలేరు-నగరి ప్రాజెక్టు ఊపిరి తీసేసినట్టయింది.

రేపు యూపీఎస్సీ పరీక్షలు

హాజరు కానున్న 1,199మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 12: యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షలు జిల్లాలో ఆదివారం జరగనున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా జూనియర్ కళాశాల (వింగ్-ఏ, వింగ్-బీ)లో, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల (వింగ్-ఏ)లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1,199మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డికి మరో షాక్

- పులిచెర్ల వైసీపీ ప్రజాప్రతినిధుల రాజీనామాలు



జడ్పీ కార్యాలయం ఎదుట పులిచర్ల జడ్పీటీసీ మురళీధర్, అతడి అనుచరులు

పుంగనూరు, జూలై 12: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వైసీపీ ప్రజాప్రతినిధులు మరో షాక్ ఇచ్చారు. పులిచెర్ల జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ తన పదవికి, పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఈయన మండల వైసీపీలో కీలకనేతగా వ్యవహరించేవారు. తనతో పాటు పదిమంది సర్పంచులు, నలుగురు ఎంపీటీసీ సభ్యులు కూడా రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు. జడ్పీటీసీ పదవికి చేసిన రాజీనామాను చిత్తూరులో జేసీ శ్రీనివాసులుకు అందజేశారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్నపుడు తమను ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తామున్నామని భరోసా కూడా కల్పించలేదని మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై పరోక్షంగా ఆరోపించారు. వైసీపీలో కార్యకర్తలకు భరోసా ఇచ్చే నాథుడేలేదన్నారు. తమపై దాడులు జరుగుతున్నా ధైర్యం చెప్పే నాయకుడు కరువయ్యారని, తాను బాధతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆ మండలానికి చెందిన మరికొందరు కూడా వైసీపీని వదిలి వదలి టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. ఇటీవల పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్, మరో పదిమంది కౌన్సిలర్లు కూడా వైసీపీకి రాజీనామాలు చేసి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోలీసుల ద్వారా ప్రతిపక్షాలపై అణచివేత ధోరణితో వ్యవహరించారు. అధికారం మారగానే అటునుంచి ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా తెలుగుదేశం పార్టీవైపు అడుగులేస్తున్నారు.

నేడు డీజీపీ రాక



తిరుపతి(నేరవి భాగం), జులై 12 : డీజీపీ ద్వారకా తిరుమలరావు రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి రానున్నారు.శనివారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకుని పోలీసు అతిథి గృహంలో కాసేపు బస చేస్తారు. అక్కడినుంచి బయలుదేరి తిరుమలకు వెళతారు. రాత్రికి అక్కడే బస చేసి ఆదివారం ఉదయం సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతిలో రాయలసీమ జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని సమాచారం. తరువాత తిరుచానూరులోని పద్మావతీ దేవిని,కాణిపాకం వెళ్ళి గణనాథుడిని దర్శించుకుంటారు.డీజీపీ హోదాలో మొదటి సారి వస్తుండడంతో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆరేళ్ల చిన్నారిపై వృద్ధుడి లైంగిక దాడి

ఏర్పేడు, జూలై 12 : ఆరేళ్ల చిన్నారిపై పాశవికంగా లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం ప్రకారం ఏర్పేడు మండలానికి చెందిన బలరామయ్య గౌడ్(61) ఓ ఆరేళ్ల చిన్నారిపై కన్నేశాడు.గత ఆదివారం అమ్మానాన్న పొలంవద్దకు వెళ్లడంతో ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారిని చాక్లెట్ ఇచ్చి తన వెంట తీసుకెళ్లాడు.లైంగికదాడికి పాల్పడడంతో చిన్నారి పెద్దగా కేకలు పెట్టింది.దీంతో అమ్మానాన్నకు ఈ విషయం చెబితే కొడతానని బెదిరించి చిన్నారిని వదిలిపెట్టాడు.ఆ రోజు సాయంత్రం స్నానం చేయించే సమయంలో నొప్పిగా ఉందని తల్లికి ఆ చిన్నారి చెప్పింది. ఆర్ఎంపీ దగ్గర చూపించగా మందులిచ్చి పంపాడు. రెండు రోజులు దాటినా నొప్పి తగ్గకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఈ నెల 9వ తేదీ రేణిగుంట సమీపంలోని బాలాజీ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు చిన్నారిపై లైంగికదాడి జరిగినట్లు నిర్ధారించారు.చిన్నారిని తల్లిదండ్రులు మెల్లగా ఏం జరిగిందని అడిగి విషయం తెలుసుకున్నారు.శుక్రవారం ఏర్పేడు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఐషర్‌లో స్నాతకోత్సవ సందడి

ఏర్పేడు, జూలై 12 : ఏర్పేడు మండలం జంగాలపల్లి పంచాయతీ శ్రీనివాసపురం వద్ద వున్న ఐషర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)లో శుక్రవారం ఐదవ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిథిగా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ఏ మషిల్కర్ హాజరై స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. కోర్సు పూర్తయిన 167మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం చేశారు. పీహెచ్‌డీ పూర్తయిన విద్యార్థులతో పాటు బీఎస్, ఎంఎస్, బీఎస్సీ పూర్తిచేసిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ స్నాతకోత్సవంలో ఐషర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.





స్నాతకోత్సవంలో డైరెక్టర్ శాంతను భట్టాచార్య, ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ఏ మషిల్కర్ - కేరింతలు కొడుతున్న విద్యార్థులు

ద్విచక్ర వాహనాల ఢీ : ఇద్దరి మృతి



మృతుడు చెంగారెడ్డి (పాత చిత్రం)

రామచంద్రాపురం, జూలై 12 : రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లి-నెత్తకుప్పం ప్రధాన రహదారిలోని వేణుగోపాలపురం సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. నెమళ్లగుంటపల్లికి చెందిన చెంగారెడ్డి(40),గోవర్ధన్(35) వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరారు. ఎన్ఆర్ కమ్మపల్లికి చెందిన దేవరాజులు, అతని బంధువు భరత్ నెత్తకుప్పం నుంచి బుల్లెట్ వాహనంపై ఇంటికి బయల్దేరారు. వేణుగోపాలపురం వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో వెనుక కూర్చున్న చెంగారెడ్డి, కూర్చున భరత్(36)కు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో చెంగారెడ్డిని తిరుపతి రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.భరత్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరి పంచాయతీలో అవకతవకలపై విచారణ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్పీవో వెంకటరమణ తదితరులు

చంద్రగిరి, జూలై 12 : చంద్రగిరి పంచాయతీలో 1.7కోట్ల రూపాయల అవకతవకలు జరిగాయయని రెండు ఫిర్యాదులందడంతో గూడూరు డీఎల్పీవో వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులు విచారణ చేపట్టారు.2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు రూ.50 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయని కలెక్టర్, డీపీవో, డీఎల్పీవో, ఎంపీడీవోలకు ఆకాశరామన్న ఉత్తరాలందాయి. మరో ఫిర్యాదులో 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.1.20కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఎస్బీఐ బ్యాంక్‌లో వ్యక్తిగత ఖాతాను తెరిచి నకిలీ బిల్లులు పెట్టి, నిధులు దొడ్డిదారిన మళ్ళించారని, దీనిపై విచారణ చేపట్టాలని చంద్రగిరి ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా అధికారులు గూడూరు డీఎల్పీవో వెంకటరమణతో కమిటీ వేశారు. దీంతో శుక్రవారం చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలోని అన్ని రికార్డులను తనిఖీ చేశారు.దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు డీఎల్పీవో తెలిపారు.ఈవోఆర్డీ శశిరేఖ, పంచాయతీ ఈవో మహేశ్వరయ్య తదితరులున్నారు.

చేతిబోరుకు మరమ్మతులు చేయించండి

పాకాల, జూలై 12: పాకాల పంచాయతీ ధర్మరాజుల గుడి వీధిలో వున్న చేతిబోరుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరారు. సబ్‌ట్రెజరీ ఆనుకొని వున్న తాగునీటి చేతిబోరు కొంతకాలంగా పనిచేయడంలేదని వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే బ్రిటీషు కాలంనాటి ఓవర్ హెడ్ ట్యాంకు, బావి శిథిలావస్థలో వున్నాయని, వీటిని అధికారులు పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే సమీపంలో వేసిన తాగునీటి బోరు వినియోగంలోకి తేవాలని, పరిసరాలను శుభ్రం చేయాలని, మురుగునీటి కాలువల్లో మురుగు పారేలా చర్యలు చేపట్టాలని వార్డు సభ్యుడు రావిళ్ల మోహన్, మచ్చా దొరస్వామినాయుడు విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి

పాకాల, జూలై 12: మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎంఈవో బాబ్జీ అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలించరాదని, ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించి వసూలు చేయాలన్నారు. టెస్ట్ బుక్స్, వర్క్ బుక్స్ విక్రయాలు జరపరాదన్నారు. తల్లిదండ్రులు అడిగిన వెంటనే టీసీలు ఇవ్వాలన్నారు. ఎంఈవో 2 లింగయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి

పాకాల, జూలై 12: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ మునిభాస్కర్ కోరారు. శుక్రవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి బ్యాంకు సేవలను ప్రజలకు వివరించారు. సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ ఖాతా ఉపయోగాలు, పన్ను రాయితీల గురించి వివరించారు.

ఉపాధి పథకంలో కమిటీలు ఏర్పాటు చేయాలి



బండి సంజయ్‌తో హరినాథ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూలై 12: ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని, నియంత్రించడానికి జిల్లా, మండల స్థాయి కమిటీలను వేయాలని చిత్తూరు జిల్లా బీజేపీ కార్యదర్శి కాయం హరినాథ్‌రెడ్డి కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు విన్నవించారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనను హరినాథ్‌రెడ్డి బృందం కలిసింది. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు పెద్దఎత్తున దుర్వినియోగం అయ్యాయని, క్షేత్ర స్థాయి సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నట్లు మంత్రికి తెలిపారు. బండి సంజయ్ స్పందించి అధికారులతో చర్చించి తగు చర్యలు చేపడుతామన్నారు.

లక్ష్మీ అలంకారంలో వారాహిదేవి

రామచంద్రాపురం, జూలై 12: రాయలచెరువు కట్టపైనున్న శక్తిపీఠం వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు లక్ష్మీవారాహిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9గంటలకు వారాహి హోమం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ జరిగింది. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

'విద్వేష' పాఠ్యాంశాలు తొలగించండి : హెచ్‌యూఎస్

తిరుపతి(విద్య), జూలై 12: వైసీపీ ప్రభుత్వ హయాంలో హిందువులపట్ల విద్వేషాన్ని పెంచేలా రూపకల్పన చేసిన పాఠ్యాంశాలను తొలగించాలని హిందూ ఉపాధ్యాయసమితి (హెచ్‌యూఎస్) జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి హిందీ పాఠ్యపుస్తకంలో హరిహరకాక అనే పాఠంలో మందిర వ్యవస్థ దాడులు, కబ్జాలు, హత్యలు చేయిస్తుందని రూపొందించారని, 9వతరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ఆత్మకథ అనే పాఠం హిందువులపట్ల ద్వేషాన్ని తీవ్రస్థాయికి తీసుకెళ్లి విద్యార్థుల మనసులను కలుషితం చేస్తోందని విమర్శించారు. విశ్వవిద్యాలయాల స్థాయిలో చర్చించాల్సిన విషయాలను పాఠశాలస్థాయికి తేవడం విద్యార్థుల్లో విషాన్ని నింపడమేనని ఆరోపించారు. ఈవిషయంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి.. అధ్యయన కమిటీని నియమించి.. విద్వేష పాఠ్యాంశాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



గోపిచంద్ మలినేని, తమన్

తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ దర్శకుడు గోపిచంద్ మలినేని, సంగీత దర్శకుడు తమన్, ఎమ్మెల్యే ఆదిమూలం, ఎంఎల్సీ రఘువర్మ, తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, బీజేపీ నేత చికోటి ప్రవీణ్‌కుమార్, శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రాజు ఉన్నారు. దర్శనం అనంతరం ఎంఎల్సీ రఘువర్మ మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో భక్తుల విషయంలో ఉన్న అలసత్వంలో మార్పు జరిగి మంచి జరుగుతుందని భావిస్తున్నానన్నారు. చంద్రబాబు, మిగతావాళ్లకు పరిపాలనపై అవగాహన ఉందన్నారు. కాలినడక భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. స్వామి వైభవాన్ని మరింతగా ప్రపంచ వ్యాప్తి చేయాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ఇటీవల ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిందని, ప్రజల తీర్పును ఎవరైనా స్వాగతించాల్సిందేనన్నారు. తాను స్వామి ఆశీస్సులతో ఒక్కసారి కూడా ఓడిపోకుండా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని సంతోషం వ్యక్తం చేశారు.

జర్నలిస్టు హెల్త్‌స్కీం గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 12: వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ స్కీం ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబీకులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారీ రూ.2లక్షల వరకు వైద్య సేవలు అందుతాయన్నారు. ఇలా ఏడాదిలో ఎన్నిసార్లయినా పరిమితి లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ తరహాలోనే వైద్యసేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పథకానికి డాక్టర్ నందమూరి వైద్యసేవ ట్రస్టు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తారని వివరించారు.

స్మార్ట్ సిటీ పనుల్లో వేగం పెంచండి: కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. వివిధ రకాల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియానికి సంబంధించిన పనులను ఆగస్టు 15లోపు పూర్తిచేయాలన్నారు. గొల్లవానిగుంటలోని క్రికెట్ స్టేడియం పనులను రెండు నెలల్లోపు పూర్తి కావాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఏజెన్సీతో మాట్లాడి వైజాగ్, కాకినాడ ప్రాజెక్టుల కన్నా ఎక్కువ సౌకర్యాలు ఉండేలా చూడాలని తెలిపారు. సోలార్ పవర్ ప్రాజెక్టుపై ప్రత్యేక నివేదిక ప్రభుత్వానికి పంపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని కమిషనర్‌కు సూచించారు. పనుల పురోగతిని తదితర వివరాలను స్మార్ట్ సిటీ ఎండీ, నగర పాలక సంస్థ కమిషనర్ అతిది సింగ్.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ మోహన్, స్మార్ట్‌సిటీ జీఎం వీఆర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మంగళంలో వివాహిత ఆత్మహత్య



హేమలత మృతదేహం

మంగళం, జూలై 12: మంగళం పంచాయతీలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళం పంచాయతీలోని కృష్ణవేణి యాదవ కాలనీలో హేమలత(30) నివాసం ఉంటోంది. పిల్లలు పుట్టాక భర్త వదిలి వెళ్లిపోవడంతో బొమ్మల క్వార్టర్స్‌లో కూలీ పనులు చేసుకునేది. ఈ సమయంలో విజయ్ అనే వ్యక్తితో పరిచయం కావడంతో అతనితో సహజీవనం చేస్తోంది. ఇద్దరి మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ శుక్రవారం ఉదయం విజయ్ ఇంటి బయట ఉండగానే హేమలత ఇంట్లో తన చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఆమె సోదరుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదుతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.

చంద్రగిరి

శ్రీసిటీ టాటా స్మార్ట్‌ఫుడ్స్ పరిశ్రమకు లీడ్ ప్లాటినం సర్టిఫికెట్



శ్రీసిటీ, జూలై 12: శ్రీసిటీలో ఆహార ఉత్పత్తులను తయారు చేసే ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ టాటా స్మార్ట్ ఫుడ్స్ లిమిటెడ్(టీఎస్ఎఫ్ఎల్) ప్రతిష్టాత్మక యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి లీడ్ ప్లాటినం సర్టిఫికెట్ అందుకుంది. సుస్థిర పర్యావరణ లక్ష్యాలను సాధించే సంస్థలను గుర్తించే లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ డిజైన్(ఎల్ఈఈడీ) సర్టిఫికేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పని సామర్థ్యం, నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, సుస్థిర పరికరాల వినియోగం వంటి కీలక అంశాల్లో అసాధారణ పనితీరు కొలమానాలుగా టాటా స్మార్ట్‌ఫుడ్స్ సంస్థ లీడ్‌ప్లాటినం సర్టిఫికెట్ సొంతం చేసుకుంది. పర్యావరణ బాధ్యత, పని సామర్థ్యం పట్ల తమ నిబద్ధతను ఇది ధృవీకరిస్తుందని సంస్థ అసోసియేట్ డైరెక్టర్, ఫ్యాక్టరీ హెడ్ పురుషోత్తమన్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు వరించడం పట్ల శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి టాటా స్మార్ట్‌ఫుడ్స్ బృందానికి అభినందనలు తెలిపారు.

రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం



చంద్రగిరి, జూలై 12: మండలంలోని కల్‌రోడ్డుపల్లె సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని సుమారు 60 సంవత్సరాల వయసు గల వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు ... కల్‌రోడ్డుపల్లె సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు రైలు పట్టాలపై మృతి చెందాడని సమాచారం అందడంతో పాకాల రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం రెండు భాగాలుగా విడిపోయి ఉంది. అయితే మృతుడు బ్లాక్ ఫ్యాంట్, తెల్లరంగు ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడని, షర్టు కాలర్‌పై చరణ్‌తేజ్ టైలర్ పేరు గల స్టిక్కర్ ఉందని, ఇతర ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, జూలై 12: పట్టణంలోని ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 26వ తేది నుంచి 30 రోజుల పాటు పురుషులకు, మహిళలకు ఉచితంగా కారు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య కలిగిన నిరుద్యోగ పురుషులు, మహిళలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకొనేవారు కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శిక్షణ సమయంలో శిక్షణార్థులకు ఉచిత భోజనం, అభ్యర్థులకు రానుపోను ఒకసారి చార్జీలు ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఒక బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే ఎంపిక చేయనున్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 7989680587, 9494951289, 6301717672 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నాలుగేళ్లలో సమస్యలన్నీ పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే నాని



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

రామచంద్రాపురం, జూలై 12: వచ్చే నాలుగేళ్లలోపు సమస్యలన్నీ పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు అభివృద్ధి పనుల వైపు దృష్టి సారించి పరుగులు పెట్టాలన్నారు. ఇంకా కొందరు అధికారులు గత ప్రభుత్వంలోనే ఉన్నామనుకుని వ్యహరిస్తున్నారన్నారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. రామాపురంలో అనధికారికంగా విద్యుత్ మీటర్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. నెత్తకుప్పం, అనుపల్లిలో స్థానికేతరులకు ప్రభుత్వ భూములు కేటాయించారని, దీనిపై తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దారు ఉషారాణిని కోరారు. పదిరోజుల క్రితమే గ్రామాల్లో వాటర్ ట్యాంకులు, కాలువలు శుభ్రపరచాలని చెప్పినా ఇంతవరకు చరలు తీసుకోలేదని ఎంపీడీవో ప్రత్యూషను అడిగారు. రాయలచెరువును చిన్ననీటిపారుదల ప్రాజెక్టుగా చేయడానికి ప్రతిపాదనలు ఇస్తామన్నారు. రాయలచెరువు కట్టపై పోలీస్ అవుట్‌పోస్టు పెట్టి సిబ్బందిని నియమించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణరెడ్డి, పీఆర్ డీఈ సేతు మాధవ్, సీడీపీవో జ్యోతి, ఎంఈవో మార్కొండయ్యానాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు కేశవులునాయుడు, జనార్దన్ చౌదరి, జేడీ జగన్ ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, డిల్లీనాథరెడ్డి, విజయకుమార్, సురేంద్రనాయుడు, వేణుగోపాల్‌నాయుడు, గిరినాయుడు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై దర్శనమిచ్చిన కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూలై 12: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలలో చివరి రోజైన శుక్రవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. దీంతో కల్యాణ వెంకన్న ఆలయ సాక్షాత్కార వైభవోత్సవాలు ముగిసాయి. ఉదయం స్వామివారికి తోమాలసేవ, కొలువు, పంచాగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి లక్ష్మీహారాన్ని తీసుకొచ్చి ఆలయ ప్రదక్షణ చేపట్టి వాహన మండపానికి తీసుకొచ్చారు. 8 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి పట్టుపీతాంబురాలు, బంగారు ఆభరణాలతో పాటు లక్ష్మీహారాన్ని అలంకరించి గరుడ వాహనంపై అధిష్ఠించారు. అనంతరం స్వామివారు గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదర్ చిరంజీవి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు పార్వేట ఉత్సవం

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాల మరుసటి రోజు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం ఉదయం శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను ఊరేగింపుగా శ్రీవారిమెట్టు మార్గంలోని పార్వేట మండపానికి తీసుకెళుతారు. పార్వేట మండపంలో ఆస్థానం, వైదిక కార్యక్రమాలు నిర్వహించి, పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఉత్సవర్లను మళ్లీ ఊరేగింపుగా ఆలయానికి తీసుకురానున్నారు.

పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా...

- కారు అదుపు తప్పి బోల్తా
- యువకుడి మృతి, ముగ్గురికి స్వల్ప గాయాలు





రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు, మృతి చెందిన పెళ్లి కుమారుడు బాలు

చంద్రగిరి, జూలై 12: పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో పెళ్లి కుమారుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జాతీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు బాలు(26) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. అయితే బాలు పెళ్లి చూపులు కోసమని బాలుతోపాటు సోదరుడు వాసు, తల్లి శంకరమ్మ, బంధువు ప్రియాంక, స్నేహితుడు దిలీప్‌లు బెంగుళూరులో బుధవారం రాత్రి 9 గంటలకు కారులో బయలుదేరి గురువారం ఉదయం 11.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా, భీమవరం వెళ్లారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు కారులో బెంగుళూరుకు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలోని చంద్రగిరి మండలం, ఎం.కొంగరవారిపల్లె సమీపంలోకి రాగానే ఆవు అడ్డం రావడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పెళ్లి కుమారుడు బాలు తలకు తీవ్ర గాయాలు కాగా, శంకరమ్మ చేయి విరిగింది. దిలీప్, వాసులకు రక్త గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా, బాలు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతిచెందిన రమాదేవి

భాకరాపేట, జూలై 12: భాకరాపేట ఘాట్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమాదేవిఅనే మహిళ మృతి చెందింది. భాకరాపేట ఎస్ఐ విజయ కుమార్ నాయక్ కథనం మేరకు ... రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ దిగువజూపల్లెకు చెందిన రమాదేవి(36) తన తమ్ముడు శ్రావణ్, కుమార్తె లక్ష్మీశిరతో కలిసి ద్విచక్ర వాహనంలో శుక్రవారం తిరుపతి నుంచి స్వగ్రామానికి మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యంలో ద్విచక్ర వాహనం చెడిపోవడంతో ఆమె తన తమ్ముడు, కుమార్తెను దానిని తీసుకురమ్మని చెప్పి ఆటోలో బయలుదేరింది. ద్విచక్ర వాహనం తోసుకువస్తున్న వారికి మంచి నీళ్ల బాటిల్ అందించేందుకు ఆటో నుంచి దిగి రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న కాంక్రీట్ మిక్సర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వారు హుటాహుటిన భాకరాపేట పీహెచ్‌సీకి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తన తల్లిని భాకరాపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు, సిబ్బందిని ఆక్సిజన్ పెట్టమని అభ్యర్థించినా వారు పట్టించు కోలేదని, ఆ తరువాత ఆక్సిజన్ అమర్చినా అది పనిచేయలేదని కుమార్తె లక్ష్మీశిర కన్నీరుమున్నీ రయ్యారు. ఈ విషయమై వైద్యాధి కారి అలెగ్జాండర్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి తీసుకువచ్చేటప్పటికే రమాదేవి మృతి చెందిందని, ఆ విషయం తాము ఆమె కుటుంబసభ్యులకు తెలియజేశామన్నారు. అయినా వారు వినకుండా ఆక్సిజన్ పెట్టమని కోరారని, ఆక్సిజన్ పెట్టినా ఫలితం లేకపోయిందన్నారు.

తిరుమలలో ఈవో శ్యామలరావు తనిఖీలు



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు తనిఖీలు చేశారు. వరాహస్వామి విశ్రాంతి భవనం, ప్రధాన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా షాపుల లైసెన్స్‌లు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని వరండాలో సరుకులను నిల్వ ఉంచి, భక్తుల రాకపోకలకు తీవ్ర ఆసౌకర్యంగా కలిగిస్తున్న దుకాణదారులను, షాపింగ్ కాంప్లెక్స్ చుట్టుపక్కల అనధికారికంగా ఉన్న తట్టలు, హాకర్లను హెచ్చరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. యాత్రికులు తిరిగేందుకు వీలు లేకుండా దుకాణదారులు సరుకులు ఉంచారని, అలా కాకుండా పరిశుభ్రతతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో యాత్రికులు షాపింగ్ చేసే విధంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను తీర్చిదిద్దాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. త్వరలో ఆనధికార తట్టలు, హాకర్ల లైసెన్సులను తనిఖీ చేసి ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు గోకులం విశ్రాంతి భవనంలో జేఈవో వీరబ్రహ్మంతో కలిసి రెవెన్యూ విభాగంపై సమీక్షించారు. కార్యక్రమంలో తిరుమల ఎస్టేట్ అధికారి విజయలక్ష్మి, ప్రత్యేకాధికారి మల్లికార్జున, ఏఈవో భాస్కర నారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆస్పత్రులు, విద్యాసంస్థలపై సమీక్ష

తిరుమల, జూలై12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహిస్తున్న ఆస్పత్రులు, విద్యాసంస్థలపై టీటీడీ ఈవో శ్యామలరావు శుక్రవారం సమీక్షించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జేఈవో గౌతమితోపాటు ఆయా ఆస్పత్రులు, విద్యాసంస్థల అధిపతులతో ఈవో సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో భాగంగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ రవికుమార్ స్విమ్స్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న చికిత్సలు, సౌకర్యాలను ఈవోకు వివరించారు. తర్వాత పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఇప్పటివరకు చిన్నపిల్లలకు 2,901 గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేసినట్టు చెప్పారు. ఇందులో 1,544 ఓపెన్ హార్ట్, 1,357 కీహోల్ సర్జరీలు ఉన్నాయన్నారు. గత మూడేళ్లలో పద్మావతి హృదయాలయంలో ఉచితంగా నిర్వహించిన 16 గుండె మార్పిడిలను, రోగులకు అందిస్తున్న సేవలను కూడా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. ఈ సమీక్షలో స్విమ్స్ నుంచి డాక్టర్ రామ్, డాక్టర్ జయచంద్రారెడ్డి, బర్డ్ ఆస్పత్రి ఆర్ఎంవో కిషోర్, వైద్యులు వేణుగోపాల్, టీటీడీ సీఎంవో మురళీధర్, ఇన్‌చార్జ్ సీఎంవో నర్మద, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ విద్యాసంస్థలలో విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల ఖాళీలు, నిధులు, కోర్సులు, ప్లేస్‌మెంట్‌లు తదితర అంశాలపై ఈవో వివరంగా సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్వీ వేదవిశ్వవిద్యాలయం వీసీ రాణిసదాశివమూర్తి, నూతన విద్యాశాఖాధికారి నాగరాజనాయుడు, టీటీడీలోని వివిధ కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలను ఐటీ హబ్‌గా మారుద్దాం

- ఎమ్మెల్యేలు ఆరణి, నాని, బొజ్జల

తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి, చంద్రగిరిలను ఐటీ హబ్‌గా చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయి. బెంగళూరు, చెన్నై నగరాలకు మధ్యలో తిరుపతి ఉంది. దీనివల్ల ఐటీ రంగం అభివృద్ధి చెందేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి' అని తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. టీకాప్ ఆధ్వర్యంలో విజన్ ఐటీ 3.0 టెక్ సమ్మిట్ శుక్రవారం సాయంత్రం స్థానిక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. తిరుపతి విద్యాకేంద్రంగా ఉండటమే కాకుండా, స్టార్ హోటళ్లు, ఆధునిక వసతులతో బస్టాండు, రైల్వేస్టేషన్ ఏర్పాటు కానున్నాయని చెప్పారు. తిరుపతి విమానాశ్రయం ఉండటంతో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు. తిరుపతిని ఐటీతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్ పట్టుదలతో ఉన్నట్లు వివరించారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో ఐటీ పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహికులకు అవసరమైన అన్ని అనుమతులను వెంటనే ఇప్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు రాష్ట్రాన్ని విడిచిపెట్టి వెళ్లాయని, చంద్రబాబు పాలనలో ఒక్కొక్కటిగా తిరిగి వస్తున్నాయన్నారు. బాబు వస్తే జాబ్ గ్యారెంటీ అనేది మరోసారి నిరూపితం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఎస్వీ యూనివర్సిటీ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ విజయ్ భాస్కర్ రావు, టీకాప్ అధ్యక్షుడు వంశీ రాయల్, రవి ధర్మవరపు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఆరణి, బొజ్జల, నాని, ప్రతినిధులు

రూరల్ మండలంలో పారిశుధ్య పనులు



ఉప్పరపల్లెలో పిచ్చిమొక్కల తొలగింపు

తిరుపతిరూరల్, జూలై12: రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. అవిలాల పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నేతలు కురకాల్వ సుధాకర్, ప్రసాద్, ముని, అంజేరయ్య, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, మెడికల్, సచివాలయ సిబ్బంది, టీచర్లు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. తుమ్మలగుంట పంచాయతీ ఉప్పరపల్లెలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో డ్రైనేజీలు, వీధులు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, టీడీపీ నాయకులు కేశవులు శెట్టి, శ్రీనివాసులు, సిద్దారెడ్డి, తులసిరామిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, సుబ్రమణ్యం, సిద్దయ్య, సుబ్రమణ్యంఆచారి, వినోద్, మనోహర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాకాల: ఇరంగారిపల్లె పంచాయతీలో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ఈవోపీఆర్డీ మాలతి పాల్గొన్నారు.పాకాలలో పంచాయతీ సిబ్బంది,ఆరోగ్య కార్యకర్తలు, వార్డుసభ్యులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

టీటీడీ డీఈవో నాగరాజుకు అభినందన



తిరుపతి(విద్య), జూలై 12: టీటీడీ విద్యాసంస్థల నూతన డీఈవోగా నియమితులైన డాక్టర్ వై.నాగరాజు నాయుడిని ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు అభినందించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టి.నరసింహులు, పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహిద్దీన్ బాషా, తెలుగు భాషోద్యమసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజు, ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా డిగ్రీ కళాశాలల సంఘ అధ్యక్షుడు డాక్టర్ నరసింహవర్మ పాల్గొన్నారు.

శాస్త్ర జ్ఞానాభివృద్ధికి శాస్త్రార్థసభలు దోహదం

తిరుపతి రూరల్, జూలై 12: విద్యార్థులు శాస్త్ర జ్ఞానాన్ని పెంచుకునేందుకు శాస్త్రార్థ సభలు ఎంతగానో దోహదపడుతాయని శృంగేరి రాజీవ్‌గాంధీ క్యాంపస్ అద్వైత వేదాంత విభాగ రిటైర్డ్ ప్రొఫెసర్ మహాబలేశ్వర్ భట్ అన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో అద్వైత వేదాంత విభాగ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గోవింద భగవత్పాద వాక్యార్థసభకి అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ.. వేదాంతంలో ఉన్న విషయాలను శాస్త్రార్థ చర్చలు చేయడం వల్ల ఆశాస్త్రం దృఢంగా ఉంటుందని తెలిపారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, గణపతి భట్, సతీష, నాగరాజు భట్, మనోజ్‌షిండే, శ్రీహరిదాయగుడే, విద్యార్థులు పాల్గొన్నారు.



బీజేపీ నేత జల్లి మధుసూదన్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న గుండాల గోపీనాథ్‌రెడ్డి తదితరులు

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించండి

● టీఎన్‌పాళెం హరిజనవాడవాసుల విజ్ఞప్తి


గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

తిరుపతి (జీవకోన), జూలై 12: శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని అటవీశాఖ అధికారులను తిమ్మినాయుడుపాళెం (టీఎన్ పాళెం) హరిజనవాడవాసులు విజ్ఞప్తి చేశారు. గురువారం ఓ యువకుడు మరణించగా, అంతిమ సంస్కారాలను అటవీభూమిలో చేయడానికి స్థానికులు వెళితే అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు కాయం వెంకటరత్నం ఈ సమస్యను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. వారు డీఎఫ్‌వో సతీష్‌రెడ్డితో చర్చించి భూమి కేటాయింపునకు సంబంధించిన నిర్ణయం వెలువడేవరకు గ్రామస్తులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. దాంతో ఇప్పటి వరకు అంతిమ సంస్కారాలు జరుగుతున్న ప్రదేశంలోనే నిర్వహించుకోవడానికి అటవీశాఖ అధికారులు అనుమతించారు. కలెక్టర్, ఎమ్మెల్యే, అటవీశాఖకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషిచేద్దాం: డీఎంహెచ్‌వో


సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీహరి

తిరుపతి(వైద్యం), జూలై 12 : కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని డీఎంహెచ్‌వో శ్రీహరి పిలుపునిచ్చారు. కుష్టువ్యాధి సర్వే కార్యక్రమంలో భాగంగా తన కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని వైద్యాధికారులందరికీ ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 18 నుంచి ఆగస్టు రెండో తేదీవరకు జిల్లా వ్యాప్తంగా కుష్టువ్యాధి సర్వే చేపట్టాలన్నారు. జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు మృదులవాణి, హరిత, వైద్యాధికారులు మధుబాబు, ఎస్వీ రమణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికుల కమిటీ



తిరుపతి (వైద్యం), జూలై 12: ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికుల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా గుర్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా వనజ, ఉపాధ్యక్షులుగా లక్ష్మి, హంసాబాయ్, పద్మ, అన్నపూర్ణ, లీల, మునిరాజమ్మ, సహాయ కార్యదర్శులుగా దీప, కవిత, రోజా, శాంతి, కోశాధికారిగా నాగజ్యోతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 13 మందిని ఆఫీస్ బేరర్స్‌గా, 12 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మెడికల్ ఏజెన్సీలో అగ్నిప్రమాదం



తిరుపతి(వైద్యం), జూలై 12: కొటకొమ్మలవీధి త్రివేణి మెడికల్ ఎంటర్‌ప్రైజస్ ఏజెన్సీలో శుక్రవారం వేకువజామున అగ్నిప్రమాదం జరిగింది. ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ఏజెన్సీలో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. వారొచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే ఫర్నిచర్, మందులు, కంప్యూటర్లు, నగదు దగ్ధమయ్యాయి. సుమారు రూ.50లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లిందని త్రివేణి మెడికల్ ఏజెన్సీ ప్రొప్రైటర్ శివకుమార్ తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో అద్భుత విజయం


జ్యోతిని వెలిగిస్తున్న ప్రకాశ్‌రెడ్డి, అధ్యాపకులు

తిరుపతి రూరల్, జూలై 12: ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే అద్భుత విజయం సొంతం చేసుకోవచ్చని బైరాగిపట్టెడలోని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ ఫైనలియర్ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, ఎంబీఏ హెడ్ డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, ఎంసీఏ అండ్ కంప్యూటర్ సైన్స్ హెడ్ పి.మధుర, అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరపాలక అధికారుల తీరు శోచనీయం: బీజేపీ


మిట్టవీధిలో సమస్యలు తెలుసుకుంటున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూలై 12: సమస్యల పరిష్కారంలో నగరపాలక అధికారుల తీరు శోచనీయమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మోటారు బోరుచెడిపోయి మూడు నెలలు కావస్తోందని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో స్థానిక మహిళల విజ్ఞప్తితో శుక్రవారం ఆయన మిట్టవీధిలో పర్యటించారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించేలా సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించాలన్నారు. అలాగే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

పేదలకు అన్నదానం


ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న మధుసూదన్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 12: ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు జల్లి మధుసూదన్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు, తాజా పండ్ల పంపిణీ చేయగా ఆస్పత్రి ప్రాంగణంలోసుమారు వెయ్యిమంది పేదలకు అన్నదానం చేశారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి, కొండయ్య, అగర్వాల్, కుమార్‌రెడ్డి, కిరణ్‌యాదవ్, చెంగల్‌రెడ్డి, రాజారెడ్డి, శివ, శేఖర్, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి రెండ్రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 12: అతిగా మద్యం తాగి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గించిన కేసులో ముగ్గురికి రెండ్రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ తెలిపిన వివరాల మేరకు.. నగరంలో ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్‌పై ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. రెండు, మూడ్రోజుల వ్యవధిలోనే 21 మందిపై కేసులు నమోదు చేసి.. శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. విచారణలో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో ముగ్గురికి రెండ్రోజులపాటు జైలు శిక్ష విధించారు.18 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 వంతున అపరాధం విధించారు. వాహన చోదకులకు ఇబ్బంది కలిగించేలా రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకుని వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్న 62 మందిని న్యాయమూర్తి ఎదుట ట్రాఫిక్ పోలీసులు హాజరుపరిచారు. వీరికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అపరాధం విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.

'వెంకటాద్రి' ప్రయాణికులకు హెల్ప్ డెస్క్



తిరుపతి(సెంట్రల్), జూలై 12: చిత్తూరు-కాచిగూడ మధ్య నడుస్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించే వారి సౌకర్యార్థం స్టేషన్‌లో అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ ఎక్స్‌ప్రెస్‌లో రైలు పెట్టెల మార్పు జరిగింది. గతంలో ఈ రైలుకు ఐసీఎఫ్ కోచ్‌లు ఉండేవి. ఒక పెట్టెకు 72 స్లీపర్ బెర్తులు ఉండేవి. ప్రస్తుతం లింక్ ఆఫ్‌మెన్ బూస్ట్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌కు 82 బెర్తులు ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ కారణంగా రిజర్వేషన్ ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండటానికి ఈ డెస్క్ ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈ ఎక్స్‌ప్రెస్ 8 ఏసీ, 10 స్లీపర్, రెండు సాధారణ కోచ్‌లతోపాటు రెండు ఎస్‌ఎల్‌ఆర్‌లతో నడుస్తుందన్నారు.

గంజాయి అమ్మకాలను ప్రోత్సహించింది తండ్రీ కొడుకులే..!

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి (జీవకోన), జూలై 12: జీవకోన ప్రాంతంలో గంజాయి అమ్మకాలను ప్రోత్సహించింది తండ్రీకొడుకులేనని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మండిపడ్డారు. శుక్రవారం జీవకోనలోని నాటారు కల్యాణ మండపంలో 46, 47, 48, 49 డివిజన్లకు సంబంధించి ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞతా సమావేశంలో ఆయన ప్రసంగించారు. గంజాయి అమ్మకాలకు ప్రధాన కారకులు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ అన్నారు. ఈ నాలుగు డివిజన్ల పరిధిలో తనకు దాదాపు ఏడు వేల పైచిలుకు మెజార్టీ వచ్చిందన్నారు. పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. మబ్బు దేవనారాయణరెడ్డి, పొలకల మల్లికార్జున్ ఎన్నికల సమయంలో క్రియాశీలకంగా వ్యవహరించారని, వారిని అభినందించారు. జీవకోన ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని, ప్రధానంగా ఇంటి పట్టాలు, తాగునీరు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి టీడీపీ మహిళా రాష్ట్ర కార్యదర్శి కుమారమ్మ మాట్లాడుతూ.. తమ ప్రాంత నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, నాయకులు శ్రీధర్ వర్మ, చిన్నబాబు, మహేష్ యాదవ్, రాజారెడ్డి, మల్లీశ్వరి, అన్నా అనిత, పూరిమిట్ట రాణి, సుధాకర్, పైపుల రవి, లలిత, మురళి, తిరుమల, యువత నాయకులు భాను, సుధ, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నుంచి తిరుపతికి పాదయాత్ర


కాలినడకన తిరుపతి చేరుకున్న అమరావతి జేఏసీ సభ్యులు

తిరుపతి అర్బన్, జూలై 12: రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతి నిర్ధారణ కావడంతో రైతులు కృతజ్ఞతా పాదయాత్రగా శుక్రవారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమరావతి జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులు ప్రకటించినప్పుడు వ్యతిరేకిస్తూ న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్రను దిగ్విజయంగా పూర్తిచేశామన్నారు. ఆ సమయంలో ఏకైక రాజధాని అమరావతినే ఎంపిక చేయాలని, ఆవిధంగా ఆశీర్వదించాలని ఆ భగవంతుడ్ని ప్రార్థించామన్నారు. తమ కోరిక నెరవేరడంతో అమరావతి రక్షణ, ఆంధ్రప్రదేశ్ సంరక్షణ పేరుతో కృతజ్ఞతా పాదయాత్ర చేపట్టామన్నారు. మొత్తం 30మందితో గత నెల 24న అమరావతిలోని వెంకటపాళెంలోని వెంకటేశ్వర ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించామని చెప్పారు. 433 కిలోమీటర్లు నిరంతరాయంగా కాలినడకన 17వ రోజున తిరుపతికి చేరుకున్నామన్నారు. శనివారం ఉదయం అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల చేరుకుంటామన్నారు. ఈనెల 15వ తేదీన శ్రీవారి దర్శనం చేసుకుని.. మొక్కులు సమర్పిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని అఖండ మెజారిటీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలన్నారు. పాదయాత్రలో సభ్యులు గుర్రం జైకృష్ణ, సురేష్, అనిత, ప్రియాంక, శివకుమారి, ప్రసన్న, కృష్ణప్రసాద్, గౌరి, కృష్ణమూర్తి, అరుణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

స్టైఫండ్ రూ.23వేలకు పెంచాలి

వెటర్నరీ విద్యార్థుల డిమాండ్


నినాదాలు చేస్తున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, జూలై 12: వైద్య విద్యార్థుల తరహాలోనే వెటర్నరీ యూజీ కోర్సులు చదివే విద్యార్థుల స్టైఫండ్ (ఉపకార వేతనం)ను రూ.7వేల నుంచి రూ.23వేలకు పెంచాలంటూ ఏపీ పశువైద్య విద్యార్థి సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. తరగతులను బహిష్కరించి వర్సిటీ పరిపాలనా భవనం వద్ద బైఠాయించారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జూనపూడి ఎజ్రా, ఆకాష్ మాట్లాడుతూ.. 15 ఏళ్లనుంచి విద్యార్థులకు నెలకు కేవలం రూ.7వేలను ఉపకారవేతనంగా అందిస్తున్నారని, దీన్ని కూడా ప్రతినెలా రెగ్యులర్‌గా ఇవ్వడంలేదని వాపోయారు. రోజువారి కూలీ కన్నా తమ స్టైఫండ్ తక్కువగా ఉందని వాపోయారు. గత ప్రభుత్వం తమను పూర్తిగా విస్మరించిందని, కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని కోరారు. అంతకముందు వెటర్నరీ కళాశాల ప్రధాన భవనం నుంచి వర్సిటీ పరిపాలనాభవనం వరకు ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ చెంగల్వరాయులు, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలతకి వినతిపత్రం సమర్పించారు. వైస్ ప్రెసిడెంట్ పవన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రుయాలో మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డు


చైర్మన్‌గా నియమితులైన పీఆర్ రాజీవ్ తదితరులు

తిరుపతి(వైద్యం), జూలై 12: రుయాస్పత్రిలో శుక్రవారం మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డును ఏర్పాటు చేశారు. బోర్డు చైర్మన్‌గా రిటైర్డ్ జిల్లా జడ్జి పీఆర్ రాజీవ్ నియమితులయ్యారు. సభ్యులుగా జాయింట్ కలెక్టర్, సైకియాట్రీ ప్రొఫెసర్, ఓ వైద్యాధికారి, ఇద్దరు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఉంటారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, సునీత, బోర్డు సభ్యులు మల్లికార్జునరావు, రుషేంద్ర, భైపాల్‌నాయుడు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పి.తాయారు తదితరులు పాల్గొన్నారు.

నేడు బహుదూరపు బాటసారి పుస్తకావిష్కరణ

తిరుపతి (కల్చరల్), జూలై 12: తిరుపతికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ సి.సుకుమార్ రెడ్డి రచించిన బహుదూరపు బాటసారి పుస్తకావిష్కరణ శనివారం సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుందని తెలుగుభాషోద్యమ సమితి ఒక ప్రకటనలో తెలిపింది. ఆఫీసర్ క్లబ్‌లో జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, ఆచార్య కె.రాజారెడ్డి, ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఆచార్య ఎ.శ్రీనివాసులు, డాక్టర్ ఎం.భాస్కరరెడ్డి, డాక్టర్ సాకం నాగరాజు, డాక్టర్ వి.కృష్ణవేణి, డాక్టర్ ఎ.గంగాధర రెడ్డి, ఎ.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొంటారు.

ఏఐసీటీఈ ఉపకార వేతనాలకు ఎస్వీ పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డి

తిరుపతి(విద్య), జూలై 12: కేటీరోడ్డులోని ఎస్వీప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సులు చదివే 11మంది విద్యార్థులు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. పదో తరగతిలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా 2024-25 విద్యాసంవత్సరానికి కంప్యూటర్స్‌లో ఏడుగురు, ఎలక్ట్రికల్‌లో ఒకరు, ఎలక్ట్రానిక్స్‌లో ముగ్గురు విద్యార్థుల చొప్పున మొత్తం 11మంది ఎంపికయ్యారని వివరించారు. వీరికి మూడేళ్లపాటు ఏటా రూ.50వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, ఎలక్ట్రానిక్స్ హెడ్ అచుత రామారావు, కంప్యూటర్స్ హెడ్ జి.బోస్‌బాబు, ఎలక్ట్రికల్ హెడ్ గోపీకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగావకాశాలు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎన్ఎస్ రెడ్డి

తిరుపతి(విద్య), జూలై 12: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చదివే వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తిరుపతికి చెందిన కౌటిల్యా ఇన్‌స్టిట్యూట్ సీనియర్ మేనేజర్ ఎన్ఎస్‌రెడ్డి తెలిపారు. కేటీరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెట్విన్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెట్విన్ మేనేజర్ కె.మోహన్‌కుమార్, జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు రెండోఏడాది కోర్సుల్లో ప్రవేశాలు

ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ కోర్సులు(ఐవీసీ) పూర్తిచేసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ డిప్లొమా రెండో ఏడాది కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల16వతేదీలోపు సమీపంలోని కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుపతి (ఆటోనగర్), జూలై 12: మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్ఈ పి.సురేంద్రనాయుడు తెలిపారు. అంతరాయం కలిగే ప్రాంతాల్లో.. ఎస్‌ఎల్‌వీ నగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, రాఘవేంద్రనగర్, శివజ్యోతినగర్, ఉపాధ్యాయనగర్ ప్రాంతాలు ● సంజయ్‌గాంధీ కాలనీ, మారుతీనగర్, లీలామహల్ సెంటర్, చింతలచేను, కొత్తపల్లె, సుబ్బారెడ్డినగర్, సుభాష్‌నగర్, ఆర్టీసీ బస్టాండు, పీకే లేఅవుట్ ప్రాంతాలు ● న్యూ బాలాజీ కాలనీ, ఎంఆర్‌పల్లె కూడలి నుంచి బాటా షోరూమ్ వరకు ఉన్న ప్రాంతాలు ● బాలాజీ కాలనీ, ఇందిరానగర్, కుమ్మరతోపు, ఎల్‌బీసీ రోడ్డు, నెహ్రూనగర్, బొమ్మగుంట, పీపీ చావడి, పట్నూలువీధి, టౌన్ క్లబ్, చిన్నబజారువీధి, కేబీ లేఅవుట్, కోర్టు ప్రాంతం, పోలీసు వసతి గృహాలు, రిజర్వాయర్‌కాలనీ ప్రాంతాలు ఉన్నాయని ఎస్ఈ పేర్కొన్నారు.

యూనివర్సిటీల్లో అవినీతిపై విచారణ చేపట్టాలి : తెలుగు యువత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12: ఐదేళ్లలో యూనివర్సిటీల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో అధికారులు, పాలకమండలి సభ్యులుగా అర్హత లేని వారిని నియమించారన్నారు. పాలక మండలి తీర్మానం కూడా లేకుండా సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉద్యోగ నియామకాలు, పదోన్నతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా యూనివర్సిటీ పాలనను గాడిలో పెట్టాలని ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నగరాల్లో ఇసుక కొరతను తీర్చాలి

తిరుపతి (ఆటోనగర్), జూలై 12: నగరాల్లో ఇసుక కొరతను తీర్చాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి చిన్నా కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకం ద్వారా నగరవాసులకు కూడా ఇసుకను చేరువ చేయాలని సూచించారు. నాగలాపురం, వెంకటగిరి ప్రాంతాలపై ఆధారపడటంతో వినియోగదారులకు తీవ్ర భారం పడుతూ ఉందన్నారు. తనపల్లె, గొల్లపల్లె, చిగురువాడ, ముండ్లపూడి, కుంట్రపాకం గ్రామాల్లో రాత్రి వేళల్లో అనధికారికంగా ఇసుక అమ్ముకుంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మోడల్ రైల్వేస్టేషన్ పనుల్లో పెరిగిన వేగం


స్లాబ్ పనుల్లో కార్మికులు

తిరుపతి(సెంట్రల్), జూలై 12: తిరుపతి మోడల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో వేగం పెరిగింది. స్మార్ట్ సిటీ స్థాయికి అనుగుణంగా రూ.300 కోట్లతో ఈ నిర్మాణ పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. స్టేషన్‌కు దక్షిణం, ఉత్తరం వైపు నిర్మించే నూతన భవనాలను కలపడానికి 40 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఎయిర్ కాన్ కోర్స్ కాంక్రీట్ పనులు వేగంగా చేస్తున్నట్లు స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాదిలోపు మోడల్ స్టేషన్ పూర్తి చేసే అవకాశం ఉందన్నారు.

'సీఏ, సీఎంఏ'లో ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ తదితరులు

తిరుపతి(విద్య), జూలై 12: ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు సీఏ ఇంటర్ ఫలితాల్లో ఈఏడాది కూడా ప్రతిభ చూపారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం తెలిపారు. ఎం.వెంకట్ యాదవ్ 402, ఎ.చరణ్‌సాయి 377, ఎం.దిలీప్ 365 మార్కులతో టాపర్లు నిలవగా.. 69.76శాతం మంది పాసయ్యారన్నారు. అలాగే సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎం.రాధిక 312, ఎం.ప్రణవ్ 304, బి.లిఖిత్ 298, సి.సుశీలేంద్ర 292మార్కులతో టాపర్లుగా నిలవగా, 91.04శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు వివరించారు. విద్యార్థులను శుక్రవారం డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్‌లతోపాటు అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, నాథముని, జానకిరామ్, అధ్యాపకులు అభినందించారు.



ఆకట్టుకున్న ఫ్యాషన్ షో

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12: పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించిన ఫ్యాషన్ షో ఆద్యంతం ఆకట్టుకుంది. యూనివర్సిటీ ఫ్యాషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు మూడేళ్లలో వివిధ డిజైన్లతో రూపొందించిన వస్త్రాలు ధరించి ఫ్యాషన్ షోలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

జర్నలిస్టు హెల్త్‌స్కీం పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 12: వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ స్కీం ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబీకులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారీ రూ.2లక్షల వరకు వైద్యసేవలు అందుతాయన్నారు. ఇలా ఏడాదిలో ఎన్నిసార్లయినా పరిమితి లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలోనే వైద్యసేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పథకానికి డాక్టర్ నందమూరి వైద్యసేవ ట్రస్టు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తారని వివరించారు.

స్మార్ట్ సిటీ పనుల్లో వేగం పెంచండి: కలెక్టర్

తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. వివిధ రకాల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియానికి సంబంధించిన పనులను ఆగస్టు 15లోపు పూర్తిచేయాలన్నారు. గొల్లవాని గుంటలోని క్రికెట్ స్టేడియం పనులను రెండు నెలల్లోపు పూర్తి కావాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఏజెన్సీతో మాట్లాడి వైజాగ్, కాకినాడ ప్రాజెక్టుల కన్నా ఎక్కువ సౌకర్యాలు ఉండేలా చూడాలని తెలిపారు. సోలార్ పవర్ ప్రాజెక్టుపై ప్రత్యేక నివేదిక ప్రభుత్వానికి పంపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని కమిషనర్‌కు సూచించారు. పనుల పురోగతిని తదితర వివరాలను స్మార్ట్ సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ అతిది సింగ్.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ మోహన్, స్మార్ట్‌సిటీ జీఎం వీఆర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అటానమస్ హోదా పదేళ్లు పొడిగింపు

'ఆదిశంకర' చైర్మన్ పెంచలయ్య



గూడూరు, జూలై 12: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదాను మరో పదేళ్లు పొడిగించినట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. శుక్రవారం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. తమ ఇంజనీరింగ్ కళాశాలకు పది సంవత్సరాల క్రితం అటా నమస్ హోదా వచ్చిందన్నారు. ఆ హోదాను మరో పది సంవత్సరాలు పొడి గిస్తూ ఉన్నత విద్యామండలి సర్టిఫికెట్ జారీ చేసిందన్నారు. ఆదిశంకర కళా శాలను డీమ్డ్ యూనివర్శిటీగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపా మన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరు గైన ఉపాధి అవకాశాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు మెరుగు పరచండి

మున్సిపల్ కమిషనర్‌కు సీపీఎం నాయకుల వినతి

గూడూరు, జూలై 12: మండలంలోని చెన్నూరులో మౌలిక వసతులను మెరు గు పరచాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూరులో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదన్నారు. శ్మశానవాటికను అభివృద్ధిపరచాలన్నారు. కుక్కలను ని యంత్రించాలన్నారు. శెట్టిగారుబీడులో రోడ్లను, కాలువలను అభివృద్ధి చేయాలన్నారు.

చికిత్సకు ఆర్థిక సాయం

గూడూరు, జూలై 12: పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో టీడీపీ కార్యకర్త వైద్యఖర్చుల నిమిత్తం శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ... తమ పార్టీ కార్యకర్త అన్వర్‌బాషా ఇటీవల కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం అన్వర్‌బాషాకు రూ.5వేలు అందజేశారన్నారు. ఉదయ్‌కుమార్, సలీం, పెంచలయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



గూడూరు అర్బన్, జూలై 12: పట్టణంలోని జడ్పీహైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి రాహుకాల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే విధంగా స్థానిక సొసైటీ కాలనీలోని నారా యణమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతు సమస్యల పరిష్కార వేదిక

గూడూరు అర్బన్, జూలై 12: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి పథకంపై రైతు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ గోపినాయక్ మాట్లాడుతూ... పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి పథకంలో ప్రధానంగా ల్యాండ్ లింకేజీ, ఈకేవైసీ, రైతులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి ఆగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించి 129 మంది రైతులను అర్హులుగా గుర్తించామన్నారు. ఏవో రమేష్ పాల్గొన్నారు.

జీవ ఎరువులతో నేల సారవంతం

వెంకటగిరి, జూలై 12: జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాలతో నేల సారవంతం అవుతుందని కృషి విజ్ఞాన కేంద్ర అధిపతి డాక్టర్ బీజీ రాజులు చెప్పారు. శుక్రవారం కేంద్రంలో జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాల ప్రాముఖ్యత, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాలతో పంటలకు ఆశించే తెగుళ్లు తగ్గుముఖం పడుతాయన్నారు. అనంతరం రైతులకు జీవ ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు నాగార్జున సాగర్, కేంద్ర శాస్త్రవేత్తలు రాజీవన, పి.నాగార్జున రెడ్డి, డి.తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, జూలై 12 : చోరీపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారి సమీపంలో టీ దుకాణం నిర్వహిస్తున్న జగన్నాథం ఎప్పటిలాగే గురువారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికెళ్లారు. శుక్రవారం ఉదయం దుకాణం తెరవడానికి వచ్చిన ఆయన తాళాలు పగలగొట్టినట్లు గుర్తించాడు. దుకాణంలోకి వెళ్లి చూడగా అందులోఉన్న రూ.6వేలు, గ్యాస్ సిలిండర్, ఫ్యాన్, ఫ్లాస్కులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

వెంకటగిరి, జూలై 12: ప్రభుత్వం తలపెట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమంలో బాగంగా మండల పరిధిలోని పాపమాంబాపురం పంచాయతీలో శుక్రవారం పరిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట కార్యదర్శి నాగమణి, నాయకులు పోలిరెడ్డి తదితరులు ఉన్నారు.

పెళ్లకూరు: ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని ఎంపీడీవో అన్నపూర్ణరావు కోరారు. శుక్రవారం పెళ్లకూరు మిట్ట లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, పూల కుండీలు, కొబ్బరి బొండాలు ఉంచరాదని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గూడూరు, జూలై 12: మండలంలోని ఈదలపల్లి నుంచి ఆటోలో తరలిస్తున్న 400 కిలోల రేషన్‌బియ్యాన్ని రూరల్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు.. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు.. మండలంలోని ఈదలపల్లి రేషన్ దుకాణం నుంచి గూడూరు గాంధీనగర్‌కు చెందిన శ్రీని వాసులు తన ఆటోలో 400 కిలోల రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా వేములపాళెం సమీపంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. బియ్యాన్ని, ఆటోను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రొయ్యలవాగు గండికి మరమ్మతులు చేపట్టరా?

- యేళ్లు గడుస్తున్నా నిర్లక్ష్యం
- ఇసుక మేటలతో రైతుల ఇబ్బంది



గండిపడిన రొయ్యలవాగు ప్రధాన కాలువ - పొలాల్లో ఇసుక మేటలు

వాకాడు, జూలై 10: ఓ వైపు ప్రకృతి విపత్తులు... మరో వైపు వైసీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో రొయ్యలవాగు ప్రధాన కాలువ దిగువన ఉన్న రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2019లో కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖి లింకు కాలువ నుంచి వేముగుంటపాళెం వచ్చే రొయ్యలవాగు ప్రధాన కాలువ పొర్లుకట్టలు సుమారు 50 మీటర్ల మేర గండిపడింటది. వైసీపీ నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరాలు కావస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. ప్రధాన కాలువకు గండిపడటంతో యేటా నవంబరు, డిసెంబరుల్లో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నీరు ప్రవహిస్తుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ముట్టెంబాక, తిరుమూరు, కోడివాక, తదితర గ్రామాల పరిధిలో సుమారు 2,200 ఎకరాలకు పైగా నీట మురిగే పరిస్థితి. ముట్టెంబాక ఎస్సీ, ఎస్టీ కాలనీలు జలదిగ్బంధంలోనే చిక్కుకొని స్థానికులు తిండి, నిద్రకు కష్టాలుపడాల్సిన పరిస్థితి. దీనిపై పలుమార్లు రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించినా పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యలవాగు ప్రధాన కాలువ గండికి మరమ్మతులు చేపడితే గ్రామాలు నీట ముంపునుంచే కాక రైతులకు కష్టాలు తప్పుతాయి. కొత్తగా కొలువు దీరిన ప్రభుత్వమైనా దీని గురించి పట్టించుకోవాలని రైతులు, ముట్టంబాక ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ డీఈ సుబ్బారావును వివరణ కోరగా.. సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. టెండర్లను త్వరలో ఆహ్వానించి గండిపడిన రొయ్యలవాగు, ప్రధానకాలువ పొర్లుకట్టలను ఆధునీకరిస్తామన్నారు.

వైసీపీ అసమ్మతి నాయకులకు 'నో ఎంట్రీ'

- టీడీపీ అధిష్ఠానం నుంచి సంకేతాలు
- ఎటూ పాలుపోని దువ్వూరు వర్గం

తడ, జూలై 12: ఒకప్పుడు వైసీపీలో అంతా తామై ఓ వెలుగు వెలిగిన ఆ వర్గం ఇప్పుడు ఎటూకాని పరిస్థితిలో పడిపోయిందా... అటు వైసీపీకి దూరమై... ఇటు టీడీపీలోకి రానీవ్వక దిక్కుతోచని స్థితికి చేరుకుందా... అంటే ఔననే సమాధానం వస్తోంది. సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీలో బలమైన నేతగా చెంగాళమ్మ ట్రస్టుబోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఓ వెలుగు వెలిగారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌ను నేరుగా కలిసేవారిలో ఆయన ఒకరు. పార్టీ ఆవిర్భావం నుంచి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు. ఆయనకంటూ ప్రత్యేకంగా వర్గం కూడా ఉంది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆయన హవానే నడుస్తుందని అందరూ భావించారు. కొంతకాలం అదే జరిగింది. అయితే 2022 నుంచి అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో మన స్పర్థలు తలెత్తాయి. దీంతో ఆయన వర్గంతో బాహాబాహీకి దిగిన సం ద ర్భాలున్నాయి. దీంతో ఎన్నికలకు ముందే వారంతా పార్టీ మారుతారంటూ ప్రచారం జరిగింది. గమనించిన వైసీపీ అధిష్ఠానం దువ్వూరుతో మాట్లాడి సర్దుబాటు చేసింది. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో పాటు సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి సుమారు 30 వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. ఆ ఓటమికి ప్రధానంగా దువ్వూరు వర్గమే కారణమంటూ కిలివేటి వర్గం ఆరోపిస్తోంది. అప్పటి నుంచి ఆ విబేధాలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో దువ్వూరు వైసీపీకి రాజీనామాచేసి టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేసినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఆయన వర్గం టీడీపీలోకి చేరిపోతోందంటూ బాహాటంగానే వ్యాఖ్యానించారు. టీడీపీలోని ఓ వర్గం నాయకులు సానుకూలత ప్రదర్శించారు. దీన్ని తెలుగుదేశంలోని ఓ వర్గం అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో వైసీపీ నుంచి ఎవరినీ చేర్చుకోవద్దంటూ స్పష్టమైన సంకేతాలు అధిష్ఠానం పంపి నట్లుగా తెలుస్తోంది. దీంతో దువ్వూరు వర్గం డైలమాలో పడింది. టీడీపీ నుంచి సానుకూల సంకేతాలు వెలువడిన వెంటనే ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి అందరూ కలసి ఆ పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమైన వర్గానికి అధినాయకత్వం ఓ రకంగా షాక్ ఇచ్చిందని చెప్పవచ్చు. అటు వైసీపీలో కొనసాగే పరిస్థితి లేక, ఇటు టీడీపీలోకి వెళ్లలేక తర్జనభర్జన పడుతున్నట్లుగా సమాచారం.

నిమ్మ రైతులకు మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే కురుగొండ్ల



పరిశోధన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 12: నిమ్మ రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మె ల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశోధన కేంద్ర ప్రిన్సిపల్ శాస్త్రవేత్త మధు మతికి సూచించారు. శుక్రవారం ఆయన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో నిమ్మ జాతులపై జరుగుతున్న ప్రయోగాల గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు పరిష్కారానికి చర్యలు చేపట్ట నున్నట్లు తెలిపారు. అదేవిదంగా నిమ్మ రైతుకులకు విరివిగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ సి.సి.నాయుడు తదితరులు ఉన్నారు.

డెంగ్యూతో చెన్నై ఆసుపత్రిలో పోరాడుతున్న విద్యార్థిని



షరీనా

డక్కిలి, జూలై 12 : డక్కిలి బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న షరీనా డెంగ్యూ బారిన పడి చెన్నై ఎగ్మూర్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ... డక్కిలి గురుకుల పాఠశాలల్లో చదువుతున్న షరీనా నాలుగైదు రోజుల నుంచి జర్వంతో బాధపడుతుంటే ఇక్కడి సిబ్బంది ఆలస్యంగా గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని చెప్పారు. బుధవారం షరీనాని రాపూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లామని అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం వారి సూచనల మేరకు నెల్లూరుకు తీసుకెళ్లామన్నారు. అయితే అక్కడ కూడా నయం కాకపోవడంతో ప్రస్తుతం చెన్నై ఎగ్మూరు ఆసుపత్రిలో చేర్పామని ప్రస్తుతం ఆమె విషమంగానే ఉందన్నారు. ప్రైవేటుగా మరో ఆసుపత్రికి తీసుకెళ్తే రూ.20 లక్షలు అవుతుందని చెప్పారన్నారు. అంత స్థోమత తమకు లేదని ఎలాగైనా ప్రభుత్వమే తమ బిడ్డను కాపాడాలని కోరుతున్నారు. షరీనాకు జ్వరంగా ఉందంటే స్థానికంగా వైద్యం అందించామని, అప్పుడు ఆ విద్యార్థినికి జ్వరం 99 ఉందని వైద్యులు గుర్తించారన్నారు. అయితే మరుసటి రోజు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారితో షరీనాను పంపించామని కళాశాల ప్రిన్స్‌పాల్ శ్రీదేవి తెలిపారు. కాగా షరీనాను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.

తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలను ఐటీ హబ్‌గా మారుద్దాం



తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి, చంద్రగిరిలను ఐటీ హబ్‌గా చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయి. బెంగళూరు, చెన్నై నగరాలకు మధ్యలో తిరుపతి ఉంది. దీనివల్ల ఐటీ రంగం అభివృద్ధి చెందేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి' అని తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. టీకాప్ ఆధ్వర్యంలో విజన్ ఐటీ 3.0 టెక్ సమ్మిట్ శుక్రవారం సాయంత్రం స్థానిక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. తిరుపతి విద్యాకేంద్రంగా ఉండటమే కాకుండా, స్టార్ హోటళ్లు, ఆధునిక వసతులతో బస్టాండు, రైల్వేస్టేషన్ ఏర్పాటు కానున్నాయని చెప్పారు. తిరుపతి విమానాశ్రయం ఉండటంతో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు. తిరుపతిని ఐటీతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్ పట్టుదలతో ఉన్నట్లు వివరించారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో ఐటీ పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహికులకు అవసరమైన అన్ని అనుమతులను వెంటనే ఇప్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు రాష్ట్రాన్ని విడిచిపెట్టి వెళ్లాయని, చంద్రబాబు పాలనలో ఒక్కొక్కటిగా తిరిగి వస్తున్నాయన్నారు. బాబు వస్తే జాబ్ గ్యారెంటీ అనేది మరోసారి నిరూపితం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఎస్వీ యూనివర్సిటీ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ విజయ్ భాస్కర్ రావు, టీకాప్ అధ్యక్షుడు వంశీ రాయల్, రవి ధర్మవరపు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై కోర్టును ఆశ్రయించిన గ్రామస్తులు



న్యాయస్థానం వద్ద పూడేరువాసులు

నాయుడుపేట టౌన్, జూలై 12: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో నిబంధనలను తుంగలో తొక్కి అడ్డూఅదుపూ లేకుండా గ్రావెల్‌ను తరలించారని నాయుడుపేట మండలం పూడేరు పంచాయతీ వాసులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. శుక్రవారం నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జికోర్టులో అర్జీ అందజేశారు. పూడేరు పంచాయతీలో ఓ వైసీపీ మహిళా నేత అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండ డంతో అప్ప ట్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకో లేదని, దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. గ్రావెల్ అక్రమ తర లింపునకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముట్టెంబాకలో 'నేడు బడికిపోతా'



బడిఈడు పిల్లలను బైక్‌పై తీసుకువస్తున్న శ్రీనివాస్

వాకాడు, జూలై 12: పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు... బడిలో అంటూ ఉపాధ్యాయుడు పి. శ్రీనివాస్ రొయ్యల గుంటల వద్ద ఉన్న బడి ఈడు పిల్లలను శుక్రవారం తన బైక్‌పై పాఠశాలకు తీసుకువచ్చారు. మండలంలోని ముట్టెంబాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులతో కలసి పనులు చేస్తున్న పిల్లలను గుర్తించి బడికి తరలించారు. పాఠశాలకు వచ్చిన పిల్లలకు పలక, బలపం, పెన్సిల్ తదితర సామ గ్రిని శ్రీనివాస్ తన సొంత నిధులతో అందిస్తున్నాడు. స్టూడెంట్ కిట్లను హెచ్‌ఎం రమణయ్య అందజేశారు.

కోట: బడి ఈడు పిల్లల కోసం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ శ్రీధర్ తెలిపారు. కోట పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంఈవో మస్తానయ్యతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. మొదటగా పాఠశాలలో విద్యార్థులకు వండిపెడుతున్న భోజనాన్ని రుచిచూడడమే కాకుండా వారితో కలిసి తిన్నారు. అక్కడ నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని హాజరుపట్టికను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, కోడిగుడ్లు, సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సత్యవేడు, ఓజిలి, తిరుపతి అర్బన్‌లోని శేషాద్రినగర్‌లో ప్రత్యామ్నాయ పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు సీట్లు

చిల్లకూరు/ కోట/నాయుడుపేట, జూలై 12: చిల్లకూరు మండలంలోని చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన బినితశ్రీ అనే విద్యార్థిని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు పొందింది. కోట పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులానికి చెందిన 11మందిలో ఇద్దరు నూజివీడు, తొమ్మిది మంది ఇడుపులపాయకు ఎంపికయ్యారు. నాయుడుపేట మండలం పుదూరు గురుకులానికి చెందిన నలుగురు విద్యార్థినులు ఇడుపులపాయ, ప్రకాశంలోని ట్రిపుల్ ఐటీలో ప్రవేశం లభించింది.

హెల్మెట్ తప్పక ధరించాలి

జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం



అవగాహన కల్పిస్తున్న జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం

గూడూరు, జూలై 12: ద్విచక్ర చోదకులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలకు లోనైతే తీవ్రగాయాలపాలు కాకుండా ఉండేందుకు హెల్మెట్ ఎంతో దోహదపడుతుందన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలకు లోనైతే మృతిచెందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి లోకనాథం, ఏఎంవీఐ ప్రభాకర్, పట్టణ సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా...

కారు అదుపు తప్పి బోల్తా

యువకుడి మృతి, ముగ్గురికి స్వల్పగాయాలు



నుజ్జునుజ్జైన కారు - బాలు మృతదేహం



చంద్రగిరి, జూలై 12: పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో పెళ్లి కుమారుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చంద్రగిరి మండలం ఎం.కొంగర వారిపల్లె వద్ద జాతీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు బాలు(26) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. అయితే బాలు పెళ్లి చూపులు కోసమని బాలుతోపాటు సోదరుడు వాసు, తల్లి శంకరమ్మ, బంధువు ప్రియాంక, స్నేహితుడు దిలీప్‌లు బెంగళూరులో బుధవారం రాత్రి 9 గంటలకు కారులో బయలుదేరి గురువారం ఉదయం 11.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా భీమవరం వెళ్లారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు కారులో బెంగళూరుకు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలోని చంద్రగిరి మండలం, ఎం.కొంగర వారిపల్లె సమీపంలోకి రాగానే ఆవు అడ్డం రావడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పెళ్లి కుమారుడు బాలు తలకు తీవ్రగాయాలు కాగా, శంకరమ్మ చెయ్యి విరిగింది. దిలీప్, వాసుకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా, బాలు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ సమావేశం

వాకాడు, జూలై 12: ఆర్టీసీ రీజియన్‌లో గత 5 సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు పి. చంద్రయ్య కోరారు. మండలంలోని స్వర్ణముఖి గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఎన్ఎంయూ నాయకులు, కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆర్టీసీ ఈడీ ఆదేశాల మేరకు 1/2019 సర్క్యులర్ విధిగా అమలు చేయాలన్నారు. రీజియన్ వ్యాప్తంగా డ్రైవర్లకు చదువులేదనే కారణంతో 12, 18, 24, 30 సంవత్సరాల ఇంక్రిమెంట్లు కలపలేదన్నారు. సర్క్యులర్ నిబంధనల ప్రకారం లిటరసీ పరీక్షలు పెట్టి వారికి ఏఎస్ ఇంక్రిమెంట్లు కలిసేలా చూడాలని కోరారు. చదువులేని గ్యారేజీ సిబ్బందితో కూడా అదే తరహాలో ఇంక్రిమెంట్లు కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఉమ్మడి జిల్లా జోనల్ అధ్యక్షుడు డీవీఆర్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పెరుమాల్, జిల్లా కార్యదర్శి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



రమాదేవి మృతదేహం

భాకరాపేట, జూలై 12: భాకరాపేట ఘాట్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. భాకరాపేట ఎస్ఐ విజయకుమార్ నాయక్ కథనం మేరకు... చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ దిగువ జూపల్లెకు చెందిన రమాదేవి(36) తన తమ్ముడు శ్రావణ్, కుమార్తె లక్ష్మిశిరతో కలిసి ద్విచక్ర వా హనంలో శుక్రవారం తిరుపతి నుంచి స్వగ్రామానికి మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యంలో ద్విచక్రవాహనం చెడిపోవడంతో ఆమె తన తమ్ముడు, కుమార్తెను దానిని తీసుకురమ్మని చెప్పి ఆటోలో బ యలుదేరింది. ద్విచక్రవాహనం తోసుకువస్తున్న వారికి మంచి నీళ్ల బాటిల్ అందించేందుకు ఆటో నుంచి దిగి రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న కాంక్రీట్ మిక్సర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమాదేవికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వారు హుటాహుటిన భాకరా పేట పీహెచ్‌సీకి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తన తల్లిని భాకరాపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు, సిబ్బందిని ఆక్సిజన్ పెట్టమని అభ్యర్థించినా వారు పట్టించుకోలేదని, ఆ తరువాత ఆక్సిజన్ అమర్చినా అది పనిచేయలేదని కుమార్తె లక్ష్మిశిర కన్నీరు మున్నీరయ్యారు. ఈ విషయమై వైద్యాధికారి అలెగ్జాండర్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి తీసుకువచ్చేటప్పటికే రమాదేవి మృతి చెందిందని, ఆ విషయం తాము ఆమె కుటుంబసభ్యులకు తెలియ జేశామన్నారు. అయినా వారు వినకుండా ఆక్సిజన్ పెట్టమని కోరారని, ఆక్సిజన్ పెట్టినా ఫలితం లేకపోయిందన్నారు.

శ్రీసిటీ టాటా స్మార్ట్‌ఫుడ్స్ పరిశ్రమకు లీడ్ ప్లాటినం సర్టిఫికెట్



శ్రీసిటీ, జూలై 12: శ్రీసిటీలో ఆహార ఉత్పత్తులను తయా రు చేసే ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ టాటా స్మార్ట్ ఫుడ్స్ లిమి టెడ్ (టీఎస్ఎఫ్ ఎల్) ప్రతిష్ఠాత్మక యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి లీడ్ ప్లాటినం సర్టిఫికెట్ అందుకుంది. సుస్థిర పర్యావరణ లక్ష్యాలను సాధించే సంస్థలను గుర్తించే లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ డిజైన్ (ఎల్ఈఈడీ) సర్టిఫికేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పని సామర్థ్యం, నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, సుస్థిర పరికరాల వినియోగం వంటి కీలక అంశాల్లో అసాధారణ పనితీరు కొల మానాలుగా టాటా స్మార్ట్‌ఫుడ్స్ సంస్థ లీడ్‌ప్లాటినం సర్టిఫికెట్ సొం తం చేసుకుంది. పర్యావరణ బాధ్యత, పని సామర్థ్యం పట్ల తమ నిబద్ధతను ఇది ధృవీకరిస్తుందని సంస్థ అసోసియేట్ డైరెక్టర్, ఫ్యాక్టరీ హెడ్ పురు షోత్తమన్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు వరించడం పట్ల శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి టాటా స్మార్ట్‌ఫుడ్స్ బృందానికి అభినందించారు.

నీరువాయి దళితవాడలో అతిసార



అతిసారతో బాధపడుతున్న వృద్ధురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, జూలై 12: పిచ్చాటూరు సమీపంలోని నీరువాయి దళిత వాడలో గత ఐదు రోజులుగా అతిసార ప్రబలుతోంది. గ్రామానికి చెందిన పలువురు బాధపడుతున్నారు. శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, డీఎంహెచ్‌వో శ్రీహరితో కలసి నీరువాయి దళితవాడను సందర్శించి బాధితులను పరామర్శించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన రోగులకు చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మురుగు నీటి కాలువలను పరిశీలించి పూడిక తొలగించి పారిశుధ్య చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శిని, ఎంపీడీవోను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి పైపులైన్ పలు చోట్ల లీకేజీ అవుతుండడంతో మురుగునీరు తాగునీటిలో కలసి కలుషితం అవుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పైపులైన్‌లో లీకేజీని అరికట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు బాలరాజు, జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 12: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలోని కుక్కంబాకం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడి మానేసిన పిల్లలను పాఠశాలకు రప్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బడులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 మునిసుబ్రహ్మణ్యం, సర్పంచు డిల్లి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ

నారాయణవనం, జులై 12: స్థానిక కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజలసేవ శుక్రవారం వేడుకగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వవాహనంపై పరాశరేశ్వరుడు

నారాయణవనం, జూలై 12: మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించారు. వేకువ జామున స్వామి అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తరువాత స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఉదయం 10.30 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన వధూవరులుగా అలంకరించి వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని అశ్వ వాహనంపై పురువీధుల్లో మంగళ వాయిద్యాలు, కోలాటాలు నడుమ ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు.

అతిసార పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

కేవీబీపురం, జూలై 12: అతిసార పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వాణి సూచించారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, వసతి గృహాలను ఆమె తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, భోజన శాల శుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు వేడి పదార్థాలను వడ్డించాలని వసతిగృహ సిబ్బందికి సూచించారు. వాతావరణంలో మార్పు కారణంగా అతిసార ప్రబలుతోందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

పుత్తూరు టౌన్, జూలై 12: పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ సంచులు, వస్తువులను వాడకాన్ని నిర్మూలించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీరయ్య అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు చాలా ప్రమాదకరమని తెలిపారు. ప్రతి ఏడాది పశువులు పక్షులు, సముద్ర జీవులు ప్లాస్టిక్ సంచుల కారణంగా చనిపోతున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, వాసవి, గంగయ్య, తిరుమలయ్య, సురేష్‌బాబు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న నాయకులు

వడమాలపేట, జూలై 12: పర్యావరణాన్ని పరిరక్షణ అందరి బాధ్యత అని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతనిధి ధనంజయులు నాయుడు చెప్పారు. మండల కేంద్రమైన వడమాలపేటలో శుక్రవారం ఇంటింటికీ చెత్తబుట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు డిల్లీ ప్రసాద్, నాయకులు లక్ష్మీప్రసన్న, గురునాథం శెట్టి, రాధాకృష్ణ, మురళీ రెడ్డి, హేమాద్రి నాయుడు, దాము యాదవ్, ఉమాపతి, సురేష్‌రాజు, జనసేన నాయకులు మునిశేఖర్, చక్రవర్తి, సచివాలయ సిబ్బంది గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి,జూలై 12: శ్రీకాళహస్తి పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్, 11కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం శనివారం 8.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు.

రేణిగుంట: మండలంలోని కరకంబాడి, గురవరాజుపల్లె, ఎల్లమండ్యం, గాజులమండ్యం, కుర్రకాలువ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మర్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు డీఈ ప్రభాకర్ తెలిపారు.

వరదయ్యపాళెం: మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇన్‌చార్జి ఏఈ శివప్రసాద్ తెలిపారు.

కొలిక్కి వచ్చిన కిడ్నాప్ కేసు

శ్రీకాళహస్తి, జూలై 12: శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ వద్ద ఎన్ఆర్ఐను కొందరు దుండగులు కిడ్నాప్ చేసి దాడి చేసిన కేసు కొలిక్కి వచ్చింది. తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐ కృష్ణమూర్తిని ఓ యువతి మరికొందరు యువకులతో కలిసి ఈనెల 3న శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌కు తీసుకువచ్చి కిడ్నాప్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నాలుగురోజుల క్రితం బాధితుడు శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం సుమారు 8మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శనివారం రిమాండ్‌కు తరలించలించనున్నారు.

మృతదేహాల అప్పగింత

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 12: మండలంలోని పార్లపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒడిశా యువకుల మృతదేహాలకు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. అనంతరం వారి మృతదేహాలను బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకట నరసంహ తెలిపారు.

ఎమ్మెలే సంతాపం

ఒడిశాకు చెందిన వలస కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ద్వారా ఆదుకోవడానికి సూళ్లూరుపేట ఆర్డీవోతో మాట్లాడినట్లు తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం కూడా ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేల ఆత్మీయ భేటీ



పులివర్తి నానితో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 12: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం సమావేశం అయ్యారు. ఊరందూరులోని సుధీర్‌రెడ్డి స్వగృహానికి విచ్చేసిన పులివర్తి నాని మర్యాద పూర్వకంగా కలిశారు. తాజా రాజకీయ అంశాలపై ఇద్దరు చర్చించారు. వైసీపీ అల్లరిమూకల దాడిలో గాయపడిన నాని యోగ క్షేమాలను సుధీర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వీడ్కోలు



బండి సంజయ్‌కు
ముక్కంటి జ్ఞాపిక అందజేస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, జూలై 12: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ రేణిగుంట విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. తిరుమల శ్రీవారి దర్శించుకుని తిరుగు పయనమైన కేంద్ర మంత్రికి రేణిగుంట విమానాశ్రయంలో కోలా ఆనంద్ సత్కరించి ముక్కంటి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్వీ రమణ, బీడీ బాలాజీ, కొండేటి గోపాల్, రమణా రెడ్డి, నాగరాజు, వేడాం నాగరాజు, బాలాజీ, జీవీ.అమర్‌నాథ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు నివాళి

పిచ్చాటూరు, జూలై 12: మండలంలోని గొల్లకండ్రిక గ్రామానికి చెందిన టీడీపీ నేత కన్నయ్య(29)కు అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆయన మృత దేహనికి ఏఎంసీ మాజీ ఛైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు మునిశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచు గుండయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి మహిళా రైతులకు స్వాగతం



రేణిగుంట, జూలై 12: అమరావతి మహిళా రైతులు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని చేతపట్టి కాలినడకన తిరుమలకు బయలుదేరారు. శుక్రవారం రేణిగుంట పట్టణానికి చేరుకున్న వారికి టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవి, ఉదయ్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు.

ప్రభుత్వ కళాశాలకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న గుడ్లూరు మయూర్

శ్రీకాళహస్తి, జూలై 12: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ రూ.30వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సొమ్మును కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలకు
శాస్త్రోక్తంగా అంకురార్పణ




ధర్మరాజస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు - ధ్వజారోహణం

శ్రీకాళహస్తి, జూలై 12: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ముక్కంటి ఆలయ ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి మండపం నుంచి దర్భ, తాడును తలపై పెట్టుకుని ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు చేరుకున్నారు. అక్కడ కలశ పూజలు, వాస్తు, పూర్ణాహుతి హోమం తరువాత కంకణ పూజ చేశారు. గర్భగుడిలో ప్రత్యేకపూజలు నిర్వ హించిన అనంతరం ధ్వజారోహణ కార్యక్రమం ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజారోహణ దర్భతాడును అధిరోహించారు. భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు విజయకుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా శనివారం పాండవ విద్యాభ్యాస కార్యక్రమం జరగనుంది.




పూజాద్రవ్యాలు తీసుకెళుతున్న ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, బొజ్జల రిషితారెడ్డి - ప్రత్యేకాలంకారంలో స్వామి అమ్మవార్లు

పాండవమూర్తుల పురవిహారం

శ్రీకాళహస్తీశ్వరాలయ మండపంలో పాండవ ఉత్సవ మూర్తులకు మొదట అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగిస్తూ ధర్మరాజస్వామి ఆలయానికి చేరుకున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయండి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 12: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పంచాయతీ కార్యదర్శులు అంకిత భావంతో పనిచేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజాసమస్యలు పెద్దఎత్తున తిష్టవేస్తున్నాయని చెప్పారు. ఎన్నికలకు ముందు గ్రామాల్లో పర్యటించి ఎన్నో ప్రజాసమస్యలను గుర్తించామన్నారు. గత వైసీపీ పాలనలో లాగా కాకుండా అధికారులు అలసత్వం వీడి అభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు. పదిరోజుల్లోగా పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల పరిధిలోని స్థానిక సమస్యలపై నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. 45రోజుల లోపు సమస్యలను పరిష్కరించి ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కు పాలనకు శ్రీకారం చుడుతున్నామన్నారు. గ్రామాల్లో 24గంటలు నాణ్యమైన విద్యుత్, తాగునీరు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీల, టీడీపీ నాయకులు మునిరాజ నాయుడు, పట్టణాధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఉద్యోగులకు న్యాయం చేయండి



మంత్రి నారా లోకేశ్‌తో ఉద్యోగులు

ఏర్పేడు, జూలై 12: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొప్పల సుధాకర్, ఉపాధ్యక్షుడు జలగం రామాంజులు, గౌరవ సభ్యులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ మానవ వనరుల మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. శుక్రవారం అమరావతిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న వారు మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఎయిడెడ్ విధానం నుంచి ప్రభుత్వంలోకి విలీనమై మూడేళ్లు గడిచినా ఇంత వరకు సర్వీస్ రూల్స్ రూపొందించలేదని, దీని వల్ల 25 నుంచి 30 సంవత్సరాల అనుభవం ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

దళితుల సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న అంబేడ్కర్ స్టార్‌కృష్ణ

ఏర్పేడు, జూలై 12: దళితుల సమస్యలను పరిష్కరించాలని అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్‌కృష్ణ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. దళితుల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు సుబ్బారావు, ప్రసాద్, విశ్వతమాల మాజీ సర్పంచు హేమాక్షి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 12: మండలంలోని కాటూరు గ్రామంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయ సిబ్బంది సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కలుషితమైన నీరు తాగడం వల్ల, దోమలు కుట్టడం ద్వారా జ్వరాలు వస్తాయన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఇంట్లో దోమలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, సచివాలయ, వైద్య సిబ్బంది గ్రామంలోని మురుగు కాలువలను పరిశీలించి పారిశుధ్యంపై పటిష్ట చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సరిత, చారుమతి, లోహిత, మానస

కేవీబీపురం, జూలై 12: కేవీబీపురం మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు సరిత, చారుమతి, లోహిత ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన ట్రిపుల్ ఐటీ పరీక్షల్లో వీరు ప్రథమశ్రేణి ఉత్తీర్ణత సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు.

పిచ్చాటూరు: మండలంలోని రజానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న సి.మానస ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం వాసు తెలిపారు. మానసను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

తారకరామనగర్: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సి.అలీషా ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు.

కనక దుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, జూలై 12: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ఏర్పేడు, జూలై 12: బండారుపల్లె రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి రైతులకు రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సదాశంకర్, శివశంకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, శంకర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.